క్లుప్తంగా

నిధులు కేటాయించాలని ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న పులిగోళ్ల శ్రీనివాస్ తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని కమ్యూనిటీ హాలు పై అంతస్తు, సీసీ రోడ్డు పనులకు నిధులు కేటాయించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, విజయ్‌కుమార్, అంకిత్ సింగ్, లాల్‌సింగ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఆస్తిపన్ను చెల్లించని ఆస్తి సీజ్



కూకట్‌పల్లి: బాలానగర్ ప్రాంతంలోని ట్రినిటీ మెటల్ ఇండస్ట్రీస్ ఆస్తిపన్ను చెల్లించనందుకు ఆ ఆస్తిని అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఆస్తి పన్ను బకాయిలు సకాలంలో చెల్లించకుంటే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రభాకర్, మురళి, టాక్స్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజీముద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు



మోతీనగర్: ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో మల్కా కొమురయ్య ఘన విజయం సాధించడంతో డివిజన్ పరిధిలోని మోతీనగర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. బుధవారం టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు పిట్ల మనోహర్, నాయకులు సీహెచ్. నర్సింగ్ రావు, కె. శ్రీలత, సుదర్శన్, టి. నాగేశ్వరరావు, గోవింద, రాథోడ్, రమేష్ నాయక్, ప్రసాద్, అశోక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను సమర్థంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న డా. సి. ఉమాగౌరి, ఆశా కార్యకర్తలు

కూకట్‌పల్లి: ఆశాలు ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత సమర్థంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సి. ఉమాగౌరి అన్నారు. బాలానగర్‌లో నిర్వహించిన ఆశా డే సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతనంగా జన్మించిన శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ చేయటం ఎంతో ముఖ్యమన్నారు. పోషకాహారం, ఐరన్ సప్లిమెంటేషన్, అనీమియా నివారణపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. హైపర్ టెన్షన్, డయాబెటీస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అవసరమైన వారికి సేవలు అందించాలన్నారు. ఇంటర్, 10వ తరగతి పరీక్షల సమయంలో విధులు నిర్వహించే వారికి, విద్యార్థులకు ఓఆర్‌ఎస్‌లు అందించాలని సూచించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో కార్పొరేటర్ రవీందర్ రెడ్డి దంపతులు తదితరులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ చరబండ రాజు నగర్‌లో సంకటహర గణపతి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సతీసమేతంగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మురుగు ఇలా.. వెళ్లేది ఎలా?



డ్రైనేజీలు పొంగి రోడ్లపై పారుతున్న మురుగు
- వాహనాల రాకపోకలకు ఇబ్బంది
- దుర్వాసనతో స్థానిక ప్రజలు

కూకట్‌పల్లి రామాలయం వద్ద రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు



కూకట్‌పల్లి మసీదు రోడ్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

ఆల్విన్‌కాలనీ: మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతుంది.పరిసరాలు దుర్గంధం వెదజల్లుతుండటంతో ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కూకట్‌పల్లి రామాలయం రోడ్డులో, మసీదు రోడ్డులో మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతూ కిలోమీటర్ల కొద్దీ ప్రవహిస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులు, రంజాన్‌మాసం సందర్భంగా మసీదుకు వచ్చే వారు ఇబ్బందులుపడుతున్నారు. కొన్నిరోజులుగా మురుగునీరు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. రాకపోకల సమయంలో ప్రయాణికులపై మురుగు నీరు పడుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు ఘర్షణ పడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినప్పుడే మ్యాన్‌హోళ్లలో నాణ్యత పాటించకపోవటం వల్లే మ్యాన్‌హోల్ కుంగిపోయి చెత్తా చెదారం చేరి మురుగునీరు బయటకు వస్తోంది. స్థానికంగా కాలేజీలు కూడా ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మురుగునీటి కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులువిజ్ఞప్తి చేస్తున్నారు.

మరిన్ని లింకు రోడ్లు ఏర్పాటు చేయాలి

- పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న పీఏసీ ఛైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: ట్రాఫిక్ నియంత్రణకు మరిన్ని లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలని పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావును కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని రోడ్లు, లింక్ రోడ్లకు, రోడ్ల విస్తరణ పనులకు ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక ప్రాసెస్ త్వరగా జరిగేలా చూడాలని కోరారు. దీనికి సిటీ ప్లానర్ సానుకూలంగా స్పందించారని, వెంటనే పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మూసాపేట: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 599 మంది విద్యార్థులకు 591 మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు అరగంట ముందే కళాశాలకు చేరుకొని పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు. కూకట్‌పల్లిలో రెండు ఆర్‌టీసీ బస్సులు బ్రేక్ డౌన్ కావడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లే సమయంలో ప్రధాన రహదారి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించి వాటిని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.



కూకట్‌పల్లిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన



రంగారెడ్డినగర్: అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఫైర్‌సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నపాటి అగ్ని ప్రమాదమైనా అప్రమత్తంగా ఉండాలని, వెంటనే నీటిని చల్లడం, మంటలపై ఇసుక చల్లడం వంటివి చేయాలన్నారు. ఎవరైనా ప్రమాదం బారిన పడితే వెంటనే వారికి బట్టలు చుట్టి మంటలను ఆర్పాలన్నారు. పెద్ద ప్రమాదం జరిగితే ఫైర్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం అందిస్తే వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతారన్నారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సంత్ గురు రావిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు



ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లో సేవాలాల్ మొచ్చి సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంత్ గురు రావిదాస్ మహారాజ్ 640 జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో మోచీ సంఘం పెద్దలు లక్ష్మణ్, సంతోష్, సంజీవ్, జయప్రకాష్ గౌస్, డేవిడ్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రావూస్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

ఆల్విన్‌కాలనీ: రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమానికి రావూస్ గ్రూప్స్ ఆఫ్ స్కూల్స్ ఫైనాన్స్ డైరెక్టర్ పొలసాని నిత్యారావు ప్రిన్సిపాల్ విద్య, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోబోటిక్స్, చంద్రయాన్, హైడ్రాలిక్ బ్రిడ్జి వంటి ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో పలు ప్రాజెక్టులను చిన్నారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. 7వ తేదీ చలో హైదరాబాద్ కార్మిక కమిషనర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెంటయ్య, నాగేషు, సత్యనారాయణ, జైపాల్, చెన్నయ్య, మనీ వెంకటమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

నిజాంపేట్ : పేదల నిర్మాణాలనే హైడ్రా, మున్సిపల్ అధికారులు కూల్చివేస్తున్నారని, ధనవంతుల జోలికి వెళ్లడం లేదని ఇందిరమ్మ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేదల గుడిసెలు మాత్రమే తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.



నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే వివేకానంద్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ రావుల శేషగిరి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో రూ. 11 లక్షలు, కైసర్‌నగర్‌లో రూ.22 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించేందుకు గత పది సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ చతుర్దశ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 6గంటలకు స్వామి వారికి పెద్దశేషవాహన సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శ ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి భూదేవి సహిత శ్రీవారి కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం అధికారులతో కలిసి డివిజన్‌లోని హస్మత్‌పేట మట్టి వడ్డెర బస్తీలో పర్యటించారు. వివిధ సమస్యలను తెలుసుకున్నారు. కమ్యూనిటీహాల్‌లో వాష్ రూమ్ సౌకర్యం లేదని, డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని, ఎల్‌ఈడీ వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ మేనేజర్ తేజను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, లక్ష్మణ్‌యాదవ్, కృష్ణ, చైతన్య, ఓం ప్రకాశ్, నాయకులు గడ్డం నర్సింగ్ రావు, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, పోచయ్య, పద్మ, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దొరికిన పర్సును పోలీసులకు అందజేత



పోలీసులకు పర్సు అందజేస్తున్న విజయ్‌కుమార్

కేపీహెచ్‌బీకాలనీ: వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి తన జేబులోని పర్సును పోగొట్టుకోగా.. పర్సు దొరికిన వ్యక్తి పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. కేపీహెచ్‌బీ ఎస్‌ఐ లింగం వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన భూముల ప్రజ్వల్ గౌడ్ స్విగ్గిలో పని చేస్తున్నాడు.

ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో అడ్డగుట్ట సొసైటీలో పర్సును పోగొట్టుకున్నాడు. అదే ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న భూమ విజయ్‌కుమార్.. రోడ్డుపై పడి ఉన్న పర్సును తీసుకొని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించాడు. పర్సులో రూ.800 నగదు, డెబిట్ కార్డులు, ఆధార్ కార్డు ఉన్నాయి. ఆధార్ కార్డు ఆధారంగా కామారెడ్డి ప్రాంతంలోని పోలీసులకు సమాచారం అందించి అతని కుటుంబ సభ్యుల ద్వారా ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో బుధవారం స్టేషన్‌కు పిలిపించి పర్సును అప్పగించారు. నిజాయితీగా పర్సును పోలీసులకు అప్పగించిన విజయ్‌కుమార్‌ను పోలీసులు అభినందించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. పట్టపగలే చోరీలు

జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు
- 57.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- నిందితుడి అరెస్ట్, రిమాండ్



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఐ రమేష్ నాయుడు



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

మియాపూర్: జైలుకు వెళ్లి వచ్చాక కూడా తన ప్రవర్తన మార్చుకోకుండా జల్సాలకు అలవాటు పడి పట్టపగలు తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కాశీబుగ్గ వివేకానంద కాలనీకి చెందిన నాగెల్లి హేమంత్ సాయి(23) మేడ్చల్ జవహర్ నగర్ కళ్యాణిదేవి కాలనీలో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి గత కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతూ.. ఆ డబ్బులతో జల్సాలు చేస్తుండేవాడు. కాగా మియాపూర్ మాధవనగర్ కాలనీలో నాన్సీ, ఆదినారాయణ దంపతులు నివాసముంటున్నారు. నాన్సీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. గత నెల 20వ తేదీ రోజు మాదిరిగానే స్కూల్‌కు వెళ్లింది.భర్త ఆదినారాయణ పనిపై వేరే ఊరికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న కుమారుడు ధీరేందర్ 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి ఉద్యోగానికి వెళ్లాడు. తర్వాత మధ్యాహ్న సమయంలో ఇంటికి పార్సిల్ వచ్చిందని భర్త ఆదినారాయణ భార్య నాన్సీకి ఫోన్ చేయగా ఆమె పార్సిల్ తీసుకోమని అద్దెదారులకు తెలిపింది. వారు వచ్చిచూడగా ఇల్లుతాళం పగులగొట్టి ఉండడం గమనించి నాన్సీకి తెలిపారు. వెంటనే వారు ఇంటికి వచ్చి బీరువా తీసి చూడగా బంగారు ఆభరణాలు, నగదు లేకపోవడం చూసి వెంటనే ఆమె మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీఎస్ పోలీసులు, మియాపూర్ పోలీసుల సంయుక్త దర్యాప్తులో నాగెల్లి హేమంత్ సాయిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతని వద్దనుండి 57.5 గ్రాముల బంగారు ఆభరణాలను మియాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ, బషీరాబాద్, అల్వాల్ పోలీస్ స్టేషన్‌లలో హేమంత్ సాయిపై 8 కేసులు నమోదై ఉన్నాయని, గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. ఈ మేరకు హేమంత్ సాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



డ్రైనేజీని పరిశీలిస్తున్న వాటర్ బోర్డు అధికారులు, నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయం రోడ్డులో డ్రైనేజీ పగలడంతో మురుగు పారుతుంది. ఆ ప్రాంతాన్ని బీజేపీ ఓబీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. తాగునీరు పైపులు సైతం పగిలి ఉండటంతో తాగునీరు, డ్రైనేజీ నీరు కలిసి సరఫరా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని వాటర్‌బోర్డు డీజీఎం నాగప్రియకు ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. మేనేజర్ సతీష్ సమస్య ఉన్న ప్రాంతానికి రావటంతో సమస్యను వివరించారు. సతీష్ అధికారులతో మాట్లాడి ఎస్టిమేషన్ వేసి శివాలయం నుంచి రామాలయం వరకు లీకేజీ సమస్య ఉందని, త్వరలో సరిచేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శంకర్ రెడ్డి, సంతోష్‌గుప్తా, విశాల్‌సాగర్, సంతోష్‌గౌడ్, ఆనంద్, శేఖర్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.